క్లుప్తంగా

రేపు కరన్‌కోట్‌కు మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్‌కు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఈ నెల 22వ తేదీన రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం బస్టాండ్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కావునా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి తైక్వాండో పోటీలు

తాండూరు టౌన్ : నేటి నుంచి మూడు రోజుల పాటు 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల ఎంపిక నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరు పట్టణంలోని తులసి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరుగనున్న ఈ పోటీలకు అండర్–14, అండర్–17 బాలబాలికలు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తప్పకుండా పోటీల్లో పాల్గొనాలని కోరారు.

29న అయ్యప్ప మహా పడిపూజ

తాండూరు: 29న నిర్వహించనున్న అయ్యప్ప స్వామి మహా పడిపూజకు తాండూరు నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున రావాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పడిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

ఆడపడచులకు అండగా ఉంటాం

పీఎన్‌పీఎస్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్



ఆర్థిక సాయం అందజేస్తున్న రాఘవేందర్‌గౌడ్

కుల్కచర్ల: ఆడపడచులకు అండగా ఉండాలన్న సంకల్పంతో పెళ్లిళ్లు చేసుకునే ప్రతి ఒక్కరికి రూ.11వేల ఆర్థిక సాయం ఇస్తామని పీఎన్‌పీఎస్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని ఘనాపూర్ గ్రామానికి చెందిన మేకల రాములు కుమార్తె పెళ్లికి రూ.11వేల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు అండగా ఉండాలని ఆడపడుచుల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని చెప్పారు. ఈ సాయం నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అంజనేయులు, రాంచంద్రయ్య, రాములు, నర్సింలు, హన్మంతు, శ్రీనివాస్, అంజనేయులు, రమేష్, బుగ్గయ్య, రఘుచారి, వెంకటేష్, చంద్రయ్య, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్ : నేడు (గురువారం) నియోజకవర్గంలోని మండలాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఏ నవీన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొడంగల్, రావులపల్లి సబ్‌స్టేషన్, దౌల్తాబాద్ మండలంలోని బాలంపేట 33/11కెవి సబ్‌స్టేషన్, బొంరాస్‌పేట మండలంలోని బురాన్‌పూర్, బాపల్లితండా 33/11కెవి సబ్‌స్టేషన్లు, దుద్యాల మండలంలోని హంసాన్‌పల్లి 33/11కెవి సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన తెలిపారు.

పంటల సాగుకు నీరందించడమే లక్ష్యం

సర్పంచ్ మల్లేశ్



ఆయకట్టుకు నీటిని వదులుతున్న మల్లేశ్, తదితరులు

దోమ : గ్రామంలోని చెరువు నుంచి ఆయకట్టు ద్వారా రైతులకు నీరందించడమే తమ లక్ష్యమని సర్పంచ్ మల్లేశ్ అన్నారు. బుధవారం మండలంలోని ఐనాపూర్ గ్రామంలో ఎంపీటీసీ విజయ, ఆయకట్టు చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో పాటు ఇరిగేషన్ సిబ్బందితో కలసి యాసంగి సాగు నేపథ్యంలో చెరువు దిగువన ఉన్న రైతులకు ఆయకట్టు ద్వారా నీరు వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానకాలంలో చెరువు పూర్తి స్థాయిలో నిండిదన్నారు. దీంతో చెరువు కింద ఉన్న ప్రతి రైతుకు నీరును అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాములు, స్కూల్ చైర్మన్ సాయిలు, గ్రామస్తులు ఆంజనేయులు, నర్సింహులు, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల గోస

- రోడ్లపై పడిగాపులు
- పంట నమోదు చేయక తంటాలు
- పట్టించుకోని అధికారులు



మిల్లు ఎదుట బారులు తీరిన వాహనాలు

పెద్దేముల్: పత్తి రైతులకు ప్రతి ఏటా గోస తప్పడం లేదు. గతంలో పత్తి మిల్లులు అందుబాటులో లేక ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం పత్తి మిల్లులు, సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా సమయానికి తూకాలు వేయక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వ్యవసాయ అధికారుల పంట నమోదు వివరాలు సక్రమంగా చేయకపోవడంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. పెద్దేముల్ మండలంలో సుమారు 10వేల ఎకరాలకు పైగా పత్తి పంటను సాగు చేశారు. గత ఏడాది కంటే దిగుబడి తక్కువ వచ్చినా సమయానికి విక్రయాలు జరుగక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటల నమోదు సక్రమంగా చేయకపోవడంతో పత్తి పంటలు వేసిన రైతులు లబోదిబోమంటున్నారు. మార్కెట్లో విక్రయ అవకాశాలు లేక దళారులను ఆశ్రయించక తప్పడం లేదని వాపోతున్నారు. పెద్దేముల్ మండలంలో రెండు పత్తి మిల్లులు ఉన్నా, సమయానికి తుకాలు కాకపోవడంతో రోడ్లపై వాహనాలను పెట్టుకొని వేచి చూడాల్సి వస్తుందని పలు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది రైతులు పత్తి పంటను సుమారు రూ.9వేల నుంచి 10వేల వరకు విక్రయించగా, ప్రస్తుతం ప్రభుత్వం రూ.7020గా ఉంది. సీసీఐ కొనుగోలు ధర తగ్గడంతో రైతుల పరిస్థితి ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. వ్యవసాయ పత్రాలు లేని రైతులకు దళారులు రూ.6400 నుంచి రూ.6500కు విక్రయిస్తున్నారు. దీంతో తుకాల్లో దళారులు మోసం చేస్తున్నారని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రైతులు పండించిన పంట విక్రయించుకోవడానికి అన్ని వసతులు కల్పించాలని మండలంలోని నాగులపల్లి, గోపాల్‌పూర్, పెద్దేముల్, రుద్రారం, జనగాంతో పాటు పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. బుధవారం పెద్దేముల్ మండల మారేపల్లి గేటు వద్ద తాండూరు– సంగారెడ్డి ప్రధాన రహదారిపై రైతులు ట్రాక్టర్, ఆటో, వ్యాన్‌ల్లో పత్తి పంట విక్రయానికి బారులు తీరారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎంఈఓ చంద్రప్ప



సమస్యలు తెలుసుకుంటున్న ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. బుధవారం బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని రొంపల్లి ,ఓగులాపూర్ పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రణాళికబద్ధంగా ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మన ఊరు– మన బడి కింద రొంపల్లి , ఓగులాపూర్ పాఠశాలలు ఎంపిక కాలేదని, ఈ క్రమంలో అవసరమైన పనులను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పురాతన పాఠశాల భవనాలు ఎక్కడైనా ఉంటే సత్వరమే కూల్చివేయాలని తెలిపారు. ఈ సందర్భంగా తొలిమెట్టు ప్రగతిపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నర్సింలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి

మండల పశువైద్యాధికారి ఆనంద్



ఆవులకు టీకాలు వేస్తున్నపశువైద్యాధికారి ఆనంద్

దోమ : గ్రామాల్లోని పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్తతోనే వ్యాధుల నివారణ సాధ్యమని మండల పశువైద్యాధికారి ఆనంద్ సూచించారు. బుధవారం దోమ మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో 99 ఆవులు, 74 గేదెలకు సర్పంచ్ దొడ్ల అంజిలయ్యతో కలసి చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి ఏటా పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా టీకాలను వేస్తుందని చెప్పారు. చలికాలంలో ఆవులు, గేదెలు గర్భకోశ వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటాయని, వాటిని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాలిభాయి, గోపాల మిత్ర కె.కేశవులు, గ్రామస్తులు అనంతరెడ్డి, అంజిలయ్య, జయవర్ధన్, వాల్యానాయక్, గుణవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ అంబులెన్స్‌లతో మేలు



అనంతగిరి: అంబులెన్స్‌లోని పరికరాలను పరిశీలిస్తున్న స్టేట్ పీఓ తదితరులు



వికారాబాద్ అర్బన్: అంబులెన్స్ పనితీరును పరిశీలిస్తున్న ప్రోగ్రామ్ ఆఫీసర్లు

వికారాబాద్ అర్బన్: వెటర్నరీ అంబులెన్స్ సేవలు గ్రామీణ రైతులు పశువైద్యం కోసం సద్వినియోగం చేసుకోవాలని జీవీకే ఈఎంఆర్ఐ స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భాగీశ్ అన్నారు. బుధవారం జిల్లాలోని వెటర్నరీ అంబులెన్సుల పనితీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజుకు ఒక్కో అంబులెన్స్ 30 నుంచి 35 పశువులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నాలుగు వెటర్నరీ అంబులెన్సులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. తమ సిబ్బంది కూడా సకాలంలో స్పందించి పశువులకు వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు 1962కు కాల్ చేసి వెటర్నరీ అంబులెన్స్ సేవలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ తనిఖీ

అనంతగిరి: పశు సంపద ఉన్న రైతులు 1962 వెటర్నరీ అంబులెన్స్ సేవలు ఉపయోగించుకోవాలని జీవీకే ఈఎంఆర్ఐ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్.భగీష్ మిశ్రా అన్నారు. బుధవారం ఆయన వికారాబాద్‌లోని 1962 సర్వీసులను తనిఖీ చేశారు. అనంతరం జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్‌తో జిల్లాలో అంబులెన్స్ సేవలపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వచ్చిన ప్రతి కాల్‌పై వెంటనే అలర్ట్ అయ్యి విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయన సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీం పట్నం రూరల్: ఈ నెల 21న (గురువారం) మంగల్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగల్‌పల్లి–2 ఫీడర్‌పై లైన్ల చెట్ల కొమ్మలు, మరమ్మతులు చేయనుండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10–00 గంటల నుంచి సాయంత్రం 5–00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆశ కార్యకర్త మృతి



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది

కొడంగల్ రూరల్ : అనారోగ్యంతో ఆశ కార్యకర్త మృతి చెందిన ఘటన మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంటలో మంగళవారం రాత్రి జరిగింది. విషయం తెలుసుకున్న తోటి ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. గుండ్లకుంట గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త నర్సమ్మ(54) గత 20ఏళ్లుగా విధులు నిర్వహిస్తుంది. ప్రభుత్వం ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

నేడు కొడంగల్‌కు హరిచందన రాక

కొడంగల్ : మున్సిపల్ సీడీఎంఏ డైరెక్టర్ హరిచందన గురువారం కొడంగల్‌కు వస్తున్నారని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన హైదరాబాద్ వెళ్లి హరిచందనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె నూతనంగా సీడీఎంఏ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గం ముఖ్యమంత్రి రేవంత్ ప్రాతినిధ్యం వహిస్తున్నందున అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. హరిచందన కొడంగల్ మున్సిపల్ పరిధిలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. భవిష్యత్తులో చేయాల్సిన అభివృద్ధి పనులపై నివేదిక సిద్ధం చేయనున్నట్లు సమాచారం.

ఒకరికి ఒకరు తోడు అవసరం



సంఘీభావ దినోత్సవం నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: ఇబ్బందుల్లో వారికి బాసటగా నిలవడం ఎంతో ముఖ్యమని కుల్కచర్ల కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి పేర్కొన్నారు. బుధవారం కేజీబీవీలో అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒకరు కష్టాల్లో ఉన్న సమయాల్లో వారికి నేనున్నా అనే ధైర్యం, సంఘీభావం ప్రకటించడంతో వారికి ఎంతో బలాన్ని ఇస్తుందని ఆమె చెప్పారు. ఒకరికి ఒకరం తోడుగా ఉంటామని భావనను కల్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని సవరించాలి

ధర్మ సమాజ్ పార్టీ నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధారూరు: మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో కల్పిస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సవరించాలని ధర్మ సమాజ్ పార్టీ పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ నాయకులు తహసీల్దార్ భువనేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెల్లరేషన్ కార్డులున్న మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న మహిళలను ఈ పథకం నుంచి తొలగించాలని సూచించారు. ఈ పథకం అమలుతో ఆటో డ్రైవర్లకు నష్టం జరుగుతుందని, వారికి నెలకు రూ. 3 వేల చొప్పున ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాజు, శేఖర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

ఎస్‌ఐ సత్యనారాయణ



విద్యార్థులకు వివరిస్తున్న ఎస్సై సత్యనారాయణ.

పరిగి: బాల్య వివాహాలు చేయడం నేరం. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పరిగి ఎస్సై సత్యనారాయణ అన్నారు. మండలంలోని నస్కల్ కస్తూర్బా బాలికల పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న నేరాల నివారణకు పోలీస్‌శాఖ గత కొన్ని సంవత్సరాలుగా షీటీంను ఏర్పాటు చేసిందన్నారు. మహిళలపై దాడులు, ఏవైనా ఘటనలు జరిగితే 100కు సమాచారం ఇస్తే పరిష్కరిస్తారని చెప్పారు. ఆన్‌లైన్ మోసాలపై కుటుంబ సభ్యులకు పూర్తిగా వివరించాలన్నారు. కార్యక్రమంలో షీటీం నిర్వాహకులు నర్సింహులు, పాఠశాల ప్రిన్సిపల్ సబియాసుల్తానా పాల్గొన్నారు.

పరిశోధనాత్మక విద్యను అలవర్చుకోవాలి

డీఎస్పీ శేఖర్‌గౌడ్



విద్యార్థులకు మెమోంటో అందజేస్తున్న శేఖర్‌గౌడ్

తాండూరు టౌన్ : విద్యార్థులు పరిశోధనాత్మక విద్యను అలవర్చుకోవాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని అక్షర కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు అనిరుథ్, సందీప్, వర్ష తయారు చేసిన ఎగ్జిబిట్ జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక కావడంపై వారిని అభినందించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచి కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా పలు ప్రయోగాత్మక పరిశోధనలను అలవర్చుకొని మేథోశక్తిని పెంపొందించుకోవాలన్నారు. అక్షర కాన్సెప్ట్ విద్యార్థులు మొబైల్ మైక్రోస్కోప్‌ను తయారు చేసి, రాష్ట్ర, సౌత్ ఇండియా పరిధిలో బహుమతులు సాధించి, నేరుగా జాతీయస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు అక్షర కాన్సెప్ట్ స్కూల్ ఎగ్జిబిట్ ఎంపిక కావడం రికార్డు అని ప్రిన్సిపాల్ మోహన్ కృష్ణ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు యూనుస్, శ్రీకాంత్, ప్రవీణ్, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గండీడ్ మండలాన్ని జిల్లాలో కలపొద్దు



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగులు

వికారాబాద్ అర్బన్: గండీడ్ మండలాన్ని వికారాబాద్ జిల్లాలో కలిపితే జిల్లా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని జిల్లా నిరుద్యోగులు పలువురు బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగం బాగా పెరిగిందన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న రిజర్వేషన్ల కారణంగా కొన్ని క్యాటగిరీల్లో 150కి 120 మార్కులు వచ్చినా ఉద్యోగం రాని పరిస్థితి నెలకొందన్నారు. వికారాబాద్ జిల్లాలో అదనంగా గండీడ్ మండలాన్ని కలిపితే జిల్లా నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఈ ఆలోచనను విరమించుకోకుంటే నిరుద్యోగుల తరఫున మరోసారి ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

ఎంఈఓ హబీబ్ అహ్మద్



స్వయం పరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కుల్కచర్ల: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ అన్నారు. బుధవారం చౌడాపూర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఉపాధ్యాయ వ్యవస్థ గొప్పతనాన్ని తెలుసుకునేందుకు ఇది ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ సహచర విద్యార్థులకు పాఠ్యాంశాలు భోదించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు గులాం మహబూబ్, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఆయుబ్ ఖాన్, నారాయణ, రామారావు, ప్రభాకర్, స్వేత, వసంత, సునిత, శశిధర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



పూజలో పాల్గొన్న కొప్పుల మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలను అలవర్చుకోవాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండల పరిధిలోని మక్తవెంకటాపూర్ గ్రామంలో మంగళ, బుధవారాలలో తుల్జా భవాని మాత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ వల్ల అందరిలో సమైక్యా భావాలు పెంపొందుతాయని అన్నారు. ముఖ్యంగా లంబాడ ప్రజల సంస్కృతి, ఆచారాలు వారి జీవనశైలి ప్రత్యేకమైందని తెలిపారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్య హరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, రాష్ట్ర గిరిజన ఉద్యోగ సంఘం అధ్యక్షుడు రాంచందర్ నాయక్, కుల్కచర్ల మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగరాజు, బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాంలాల్, నాయకులు రాజప్ప, మాలె కృష్ణయ్య, మొగులయ్య, రమేష్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

అనంతగిరి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అత్వెల్లి గ్రామ సర్పంచ్ మోహన్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండలంలోని అత్వెల్లి గ్రామంలో అనంత్‌రెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో రోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరిక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ పావని, జనరల్ ఫిజిషియన్ రాఘవేందర్‌రెడ్డి, నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి

దోమ : గ్రామంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బాస్‌పల్లి, తిమ్మాయపల్లి రోడ్లకు ఇరువైపులలా నాటిన మొక్కలకు ఉపాధి హామీ సిబ్బందితో పాదులు, కంచెలను ఏర్పాటు చేసి నీరును అందించామన్నారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరిత హారం కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. కోతుల బెడద ఎక్కువగా ఉందని, నాటిన మొక్కలను నాశనం చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయ పనుల పరిశీలన



క్యాంపు కార్యాలయ పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని అన్ని వసతులతో తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అధికారులను ఆదేశించారు. కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతు పనులను ఆమె బుధవారం పరిశీలించారు. స్పీకర్ నివాసం ఉండబోతున్నందున అందుకు తగట్టుగా ఏర్పాట్లు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. వాస్తు ప్రకారం చేపట్టాల్సిన మార్పుల గురించి పలు సూచనలు చేశారు. వారం పది రోజుల్లో పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి, కిషన్‌నాయక్, మాజీ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఓటరు నమోదు ప్రక్రియ

తహసీల్దార్ కిషన్



బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న విజయేందర్

పెద్దేముల్: ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ అన్నారు. బుధవారం పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఓటరు నమోదుపై మాస్టర్ ట్రైనర్‌ల చేత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కిషన్ మాట్లాడుతూ.. ఓటరు నమోదులో మార్పులు చేర్పుల కోసం జనవరి 5వ తేది వరకు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఫిబ్రవరి 6నుంచి 22వ తేది వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు తప్పకుండా రషీదు తీసుకోవాలని సూచించారు. తుది జాబితా ఫిబ్రవరి 8వ తేదీన ప్రదర్శించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజిరెడ్డి, మాస్టర్ ట్రైనర్‌లు రాములు, లక్ష్మన్, కార్యదర్శులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఓటరు లిస్టు ప్రక్షాళన

తాండూరు టౌన్ : ఓటరు లిస్టు ప్రక్షాళనను బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓ) సరి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాలలో బీఎల్‌ఓలకు రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విజయేందర్ మాట్లాడుతూ.. 1 జనవరి 2024 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులచే ఫారం–6 ను నింపించాలన్నారు. లేని యెడల ఆన్‌లైన్‌లో జనవరి 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే, మృతి చెందిన లేదా డబుల్ ఓట్లు ఉన్న వారి చేత ఫారం–7ను నింపించి, ఆ ఓట్లను తొలగించాలన్నారు. ఓటరు లిస్టులో మార్పులు, చేర్పుల కోసం ఫారం–8 నింపాలని తెలిపారు. బీఎల్‌ఓలు విధులపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.